క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం


నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనంద్ మన వడి వైద్యఖర్చులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసిన ఆనంద్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే 19వ వార్డుకు చెందిన ఖాజాబీ అనే మహిళకు ఎమ్మెల్యే ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి బాటలో ఏడీసీసీ బ్యాంకు


గుత్తి ఏడీసీసీ బ్యాంకులో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లిఖిత

గుత్తి: ఏడీసీసీ బ్యాంకు అభివృద్ధి బాటలో పయనిస్తోందని బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత అన్నారు. గుత్తిలోని శ్రీసాయి డిగ్రీ కాలేజీలో శుక్రవారం బ్యాంకు పని విధానంపై ఖాతాదారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడీసీసీ బ్యాంకు ప్రజలకు ఆర్థిక సాయం అందించడంలో అన్ని బ్యాంకుల కంటే ముందుందన్నారు. ప్రజలందరూ ఏడీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్యాంకును తనిఖీ చేశారు. బ్యాంకులోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. బ్యాంక్‌లో డిపాజిట్లు, ఖాతాదారుల సంఖ్య, రుణాలపై ఆరా తీశారు. బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా, బ్యాంకు మేనేజర్ జానకిరామిరెడ్డి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా జానకిరామిరెడ్డి



గుత్తి: స్థానిక ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా జానకిరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మేనేజర్‌గా పని చేస్తున్న మంజుల మెటర్నిటీ లీవ్‌లో వెళ్లారు. దీంతో పామిడిలో పని చేస్తున్న జానకి రామిరెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈసందర్భంగా నూతన మేనేజర్‌కు బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు హెరిటేజ్ వాక్

గుత్తి: పట్టణంలో ఇంటాక్ ఆధ్వర్యంలో శనివారం హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, టూరిజం జిల్లా అధికారి నాగేశ్వరరెడ్డి చెప్పారు. పట్టణంలోని కోట వీధిలో శుక్రవారం వారు మాట్లాడారు. పట్టణంలోని హంపన్న సమాధి వద్ద నుంచి కోట వరకు వాక్ నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, అధ్యక్షుడు విజయభాస్కర్, ఉపాధ్యక్షులు కాశీరావు, గురు శంకర్, జ్ఞానేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న రాధిక అనే మహిళకు శుక్రవారం పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాధిక గ్రామ శివారులో ఉన్న తోటలో వ్యవసాయ పనులు చేస్తుండగా కాలికి పాముకాటు వేసింది. గమనించిన ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో రైతులు అక్కడికి చేరుకొని పామును చంపివేశారు. అనంతరం ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు రాధికను అనంతపురం తీసుకెళ్లారు.

భూసార పరీక్షల ఆధారంగానే పంటలు సాగు చేయాలి


మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

గుంతకల్లు రూరల్: రైతులు భూసార పరీక్షల ఆధారంగానే పంటల సాగు చేయాలని ఆత్మా పీడీ మద్దిలేటి సూచించారు. శుక్రవారం పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో ఆత్మ డీఆర్సీ(అనంతపురం)ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మ పీడీ భూసార పరీక్షల నిర్వహణ, వాటి ఉపయోగాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూసార పూర్తిగా తగ్గిపోతుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ఏడీఏ పద్మజ, ఏవో స్వాతి పాల్గొన్నారు.

సంక్షేమసారథి జగనన్న


గుత్తిలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ


గుంతకల్లు మండలం దంచర్లలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


పామిడి పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనుల బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం


గుత్తి మండలం తొండపాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం


పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరామిరెడ్డి

సాక్షి నెట్‌వర్క్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా సంక్షేమ సారథిగా మారారని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం పామిడి, గజరాంపల్లి, గుత్తి 11వ వార్డు, గుంతకల్లులోని 1, 22 వార్డులు, గుత్తి మండలం తొండపాడు, తాడిపత్రి మండలం ఆలూరు, తాడిపత్రిలోని కృష్ణాపురం-2, బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, యాడికి మండలం గుడిపాడు, గుంతకల్లు మండలం దంచెర్ల, పెద్దవడుగూరు మండలం బుర్నాకుంట, గార్లదిన్నె మండలం బూదేడు, పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు ప్రభుత్వం ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు.


గార్లదిన్నె మండలం బూదేడులో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు


యాడికి మండలం గుడిపాడులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచు సావిత్రి


తాడిపత్రి కృష్ణాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న దృశ్యం


పెద్దవడుగూరు మండలం బుర్నాకుంటలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం

యాడికి: మండలం కేంద్రంలో శుక్రవారం ఆర్డీటీ ఏటీఎల్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. ఆర్డీటీ సీఓలు ఆంజనేయులు, నాగప్ప, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ ఏటీఎల్ సుశీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏటీఎల్ మాట్లాడుతూ దిశ యాప్, హెల్ప్‌లైన్ నంబర్స్ , 100, 181, 1098, 101, అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ శ్రీనివాసగౌడ్, ఆర్డీటీ ఛైల్డ్ డిపార్టుమెంట్ డైరెక్టరు శిల్ప పాల్గొన్నారు.

రేపటి నుంచి భారత్ సంకల్పయాత్ర

గార్లదిన్నె: ఆదివారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అధికారులు మండల స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు వివరాలు శాఖల వారిగా సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామకార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు , వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు.

అధిక టన్నేజీపై కేసు నమోదు చేస్తాం

యాడికి: అధిక లోడు, టన్నేజీలతో రవాణా చేసే వాహనాలపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి, తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోన రోడ్డు, రాయలచెరువులోని చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని నాలుగు వాహనాలను సీజ్ చేసి ఆర్టీఓ అధికారులకు అప్పగించినట్లు వారు తెలిపారు. అధిక లోడుతో వెళ్లే ఆటోలు, లారీలలో ప్రయాణం చేయటం ప్రమాదకరమన్నారు. బస్టాండు వద్ద నుండి ప్రతి 20 నిమిషాలకు వచ్చే ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, పోలీసులు పాల్గొన్నారు.


ఆటోలను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ డీఎం శంకర్, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి

జేసీవి దిగజారుడు రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రి: ప్రజలతో మమేకమై దూసుకుపోతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నేరుగా ఎదుర్కోలేక దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మహిళను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయించడాన్ని వారు ఖండించారు. శుక్రవారం తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కౌన్సిలర్ రాఘవేంద్రప్రసాద్, వక్ఫ్‌బోర్డు సెక్రటరీ బాబా, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగులకుంట కేశవరెడ్డి, మాజీ కౌన్సిలర్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు గురుశంకర్, క్రిష్ణయ్య తదితరులు విలేకరులతో మాట్లాడారు. మహిళను పావుగా వాడుకుని ఎమ్మెల్యేపై దురుసుగా మాట్లాడించడం ప్రభాకర్‌రెడ్డి నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. సదరు మహిళ బాగోతం, బండారం తాడిపత్రి ప్రజలకు బాగా తెలుసన్నారు. చౌకబారు వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేసిన ఆ మహిళను విమర్శించడానికి తమకు సంస్కారం అడ్డు వస్తోందన్నారు. ప్రజల సంక్షేమానికి, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని మున్సిపల్ చైర్మన్ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ హోదాలో ఉండి కూడా పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను ఆపివేయించడం, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌ను బెదిరించడం, అండర్ డ్రైయినేజీ అడ్డుకోవడం, పేదలకు పట్టాలు రాకుండా చేయడం, అధికారులను, పోలీసులను బ్లాక్‌మేల్ చేయడం ఏమాత్రమూ సమంజసం కాదన్నారు. ప్రజాప్రతినిధి పట్ల అనుచితంగా మాట్లాడుతున్న పోలీసులు కట్టడి చేయకుండా మౌనం వహించడం విమర్శలకు తావిస్తోందన్నారు. రాజకీయం చేతకాకపోతే తప్పుకోవాలే కానీ మహిళల చేత నీచంగా మాట్లాడించడం తగదని హితవు పలికారు. అభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగులుతూ రాజకీయ విలువలకు తూట్లు పొడుస్తున్న ప్రభాకరరెడ్డిని జనం అసహ్యించుకుంటున్నారన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయలని డీఆర్‌ఓ గాయత్రిదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలన్నారు. నగర పరిధిలోని తపోవనం, బైపాస్, కళ్యాణదుర్గం రోడ్డు, తదితర ప్రధాన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో బస్సులు, ఇతర వాహనాలు తక్కువ వేగంతో వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రహదారి భద్రతకు తీసుకుంటున్న చర్యలపై రవాణా శాఖ ఉప కమిషనర్ వీర్రాజు వివరించారు. రహదారి భద్రత, చట్టాలపై విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో 42 సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర తప్పిదాలపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి, 33 చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఏఐ పీడీ భూషణం భరత్, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ క్రికెటర్ అంబంటి రాయుడు ఉదయం 8 గంటలకు హాజరవుతారన్నారు. బీకేఎస్‌లోని మునలమ్మ కట్ట వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ సర్కిల్ నుంచి ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా తులశమ్మ పూజ


తులశమ్మకు పూజ చేస్తున్న మహిళలు

యల్లనూరు: మండల వ్యాప్తంగా మహిళలు ద్వాదశి సందర్భంగా శుక్రవారం తులశమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నేత అనుపూరి సుబ్బయ్య స్వగృహంలో తులశమ్మ పూజను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేపు హజరత్ సయ్యద్ షా వలి ఉరుసు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా విరాజిల్లుతున్న హజరత్ సయ్యద్ షా వలి బీబీ మరియంబీ రమతుల్లాలైల ఉరుసును ఆదివారం నిర్వహిస్తున్నట్లు దర్గా ప్రెసిడెంట్ నాగభూషణ (బూసీ) తెలిపారు. కార్యక్రమానికి బనగానపల్లి డాక్టర్ సయ్యద్ హుసేని బాదుషా శిష్య బృందం హాజరవుతారన్నారు. ఈసందర్భంగా దర్గా ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హిందూ ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మట్కాబీటర్ల అరెస్టు

యాడికి: రాయలచెరువు గ్రామంలో శుక్రవారం ఇద్దరు మట్కా బీటర్లను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిరిగాపురం గ్రామానికి చెందిన సోమనాథ, రమేష్ మట్కా రాస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.7,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రిటౌన్: డిసెంబర్ 15లోపు తాడిపత్రి నియోజకవర్గం వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలో తన కార్యాలయంలో ట్రాన్స్‌కో ఏడీఈ తోపాటు అన్ని మండలాల ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలు, ఇళ్లకు అడ్డంగా ఉన్న విద్యుత్‌స్తంభాలు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఎవ్వరూ విద్యుత్ సమస్యలు చెప్పకూడదని హెచ్చరించారు. మున్సిపాలిటీ అనుమతులు, మెటీరియల్ వంటి సదుపాయాలను సమకూర్చుతానని తెలిపారు. తాను గడప గడపకూ కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఆయా గ్రామాల్లో ప్రజలు చెప్పిన విద్యుత్ సమస్యలను ఆయన వారికి మండలాల వారీగా తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ రఘు, తాడిపత్రి రూరల్ ఏఈ సుదర్శన్, టౌన్ ఏఈలు ఉదయభాసర్, రామాంజులరెడ్డి, యాడికి ఏఈ రాజారాం పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దవడుగూరు నుంచి గుత్తి వైపు వెళ్తున్న బైక్ గుత్తి నుంచి పెద్దవడుగూరు కి వస్తున్న కారు రెండు పెద్దవడుగూరు గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన చెన్నప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

శ్రీరామ నామంతో మార్మోగిన పురవీధులు


శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


అక్షింతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: జై శ్రీరామ్ నామా స్మరణతో పురవీధులు పులకించాయి. శ్రీరామ జన్మభూమి అయోధ్య శ్రీరాముని పూజించిన అక్షింతలు గుంతకల్లుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. స్థానిక బీరప్ప గుడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా శ్రీకోదండరామాలయం వరకు యాత్ర కొనసాగింది. అనంతరం కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కాకర్ల ప్రకాష్, కార్యక్రమ నిర్వాహకుడు బండిమురళీ, కార్యదర్శి వి.ప్రభాకర్, రామాలయ ఈఓ మఠం మల్లికార్జున, కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ జిల్లా ప్రముఖ్‌లు గద్వాల ప్రతాప్, జయలక్ష్మి, రవి, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, జైన్‌సమాజ్, తదితర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అనంతపురం క్రైం: అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బళ్లారి బైపాస్ ఎంజీ షోరూం సమీపంలోని ఓ షెడ్డులో బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించి, సీజ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠా ఇక్కడ దాచి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తనిఖీలో సీఐ రామారావు , సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో రైల్వే క్వార్టర్స్

- పట్టించుకోని రైల్వే అధికారులు
- ఉద్యోగులకు తప్పని ఇక్కట్లు


ట్విన్‌లైన్‌లో కాలం చెల్లిన క్వార్టర్స్ తొలగించడంతో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు


శిథిలావస్థలో వీవీ నగర్‌లోని రైల్వే క్వార్టర్స్

గుంతకల్లు: కాలం చెల్లిన రైల్వేక్వార్టర్స్‌లో ఉద్యోగులు నివాసాలు బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారు. రైల్వే ఉన్నతధికారుల నిర్లక్ష్యం కారణం ఉద్యోగుల పాలిట శాపం మారింది. గత ఐదేళ్లలో వందలాది రైల్వే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో తొలగించారు. అయితే వాటి స్థానంలో కొత్తవి నిర్మించకపోవడంతో వందలాది ఉద్యోగులు అద్దె భవనాల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న ఈ క్వార్టర్స్ కూడా మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నారే తప్ప ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. రైల్వే డివిజన్‌లోని ప్రధాన కేంద్రమైన గుంతకల్లులో అకౌంట్స్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, కమర్షియల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్, మెడికల్, మెకానికల్, రన్నింగ్, డీజిల్, సీ అండ్ డబ్ల్యూ, ఎస్అండ్‌టీ, సెక్యూరిటీ విభాగాల్లో వందలా మంది కార్మికులు పని చేస్తున్నారు. రైల్వేబోర్డు నిబంధనల ప్రకారం రైల్వేస్టేషన్‌కు సమీపంలో సిబ్బంది నివాస గృహాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

అసాంఘిక కార్యాకలాపాలకు నెలవు..

పట్టణంలోని శాంతినగర్, పోర్టర్‌లైన్, అరవిందనగర్, ప్రభాత్‌నగర్, హనుమాన్‌నగర్, ట్విన్‌లైన్, ఐటీసీ డిపో, వీవీ నగర్ తదితర ప్రాంతల్లో ఉండే రైల్వే ఉద్యోగుల కుటుంబాలతో ఒకప్పుడు కళాకళలాడుతుండేవి. కాలనీల్లో ఉద్యోగులు వృత్తి పరమైన ఏమైన సమస్యలు వస్తే చర్చలు జరుపుకుని పరిష్కారించుకునేవారు. దీంతో పాటు పండగలు వచ్చిన, శుభకార్యాలు జరిగినా అందరూ కలిసి జరుపుకునేవారు. అయితే ప్రస్తుతం హనుమన్‌నగర్, ఐటీసీ డిపో ఏరియాలోని కాలనీల్లోని క్వార్టర్స్ పాతబడిపోవడంతో వాటిలో ఉద్యోగులను ఖాళీ చేయించారు. క్వార్టర్లపై పర్యవేక్షణ కొరవడటంతో దీన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు కొందరు క్వార్టర్ల తలుపులు, కిటికీలు ఎత్తుకెళుతున్నారు. ఇక రైల్వే ఆస్పత్రి సమీపంలోని క్వార్టర్స్ పూర్తిగా తొలగించడంతో ఏరియా మొత్తం బోసిపోయి దర్శనమిస్తోంది. ఇక హనుమాన్‌నగర్‌లోని క్వార్టర్స్ అసాంఘిక కార్యకలాపాలకు నెలవయ్యాయి. ఈ కారణంగా రైల్వే కార్మికులు అటువైపుగా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. అయితే ఈ విషయమై ఓ రైల్వే ఉన్నతధికారులతో మాట్లాడగా కాలం చెల్లిన వందలాది క్వార్టర్లను తొలగించామని, అయితే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదన్నారు. కొత్త క్వార్టర్స్ మంజూరు చేయాలని ప్రతిపాదన పంపిన ఇంత వరకు ఎలాంటి స్పందన లేదని చెబుతున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ డే ను పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు వాలీబాల్, రన్నింగ్‌రేస్, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించారు. శనివారం సాయంత్రం స్థానిక టీసీ హైస్కూల్‌లో జరిగే ఎన్‌సీసీ డే ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని ఎన్‌సీసీ యూనిట్ అధికారి వై రామాంజనేయులు తెలిపారు.